“బ్రతుకు బుగ్గి చేసిన సారా” కథల పోటీలో ఈ వారం ఎన్నికయిన కథ

# కొత్త వెలుగులు

## ఎన్. శైలజ




వెంకమ్మ గుడిసె ముందు జనం గుంపులు గుంపులుగా గుమికూడారు. రకరకాలుగా వాళ్ళ గురించి మాట్లాడుకొంటున్నారు.

“చూశావా! సుబ్బమ్మత్తా! వెంకమ్మ ఎంత పని చేసిందో! మొగుడిని కత్తిపీటతో కాలు మీద వేసిందట. దాంతో వెంకమ్మ మొగుడి కాలు విరిగింది. కలికాలం కాకపోతే ఎవరైనా మొగుడ్ని కాలు మీద కత్తిపీటతో నరుకుతారా చెప్పు!” అంటూ రాములమ్మ బుగ్గలు నొక్కుకుంది.

“మరి ఏం చేస్తుంది పాపం! మొగుడొక తాగుబోతు! తాగి కొడ్తే ఏ ఆడదైనా ఎంతకాలం భరిస్తుంది చెప్పు!” అంది వెంకమ్మ మీద సానుభూతి చూపిస్తూ సుబ్బమ్మ. లోపల గుడిసెలో వెంకమ్మ నిర్లిప్తంగా గుంజెనానుకొని కూర్చొంది. ఆమె మొగంలో వెలుగు లేదు. నిన్న జరిగిన సంఘటన ఆమె మదిలో మెదిలింది. వెంకమ్మ పెద్దిరెడ్డి గారింట్లో పనిచేసి అలిసిపోయి నులక మంచం మీద పడుకొంది. రెడ్డి గారింట్లో నుంచి తెచ్చిన అన్నం తిని శీను నిద్రపోయాడు. తనకు ఆకలి లేదు. ఒళ్ళంతా నొప్పులుగా వుంటే వండే ఓపిక లేక నీరసంగా పడుకొంది.

ఎప్పటిలాగే అర్ధరాత్రి పూటుగా తాగి తూలుతూ వచ్చాడు కోటయ్య.

రాగానే పడుకొన్న వెంకమ్మను చూసి “ఏమే! ఒళ్ళు కొవ్వెక్కి పడుకొన్నావ్! లే! లేచి నాకు అన్నం పెట్టు.” అన్నాడు. మాటలు ముద్దగా వస్తున్నాయి.

“అయ్యా! నాకు జ్వరం వచ్చేటట్లుంది. ఒంట్లో ఓపిక లేదు. ఏదో ఈవాల్టికి గంజి తాగి పడుకో! రేపు వంట చేస్తాను”. అంది వెంకమ్మ నీరసంగా! ఆ మాటలకు కోపం వచ్చింది కోటయ్యకు.

“ఏమే! పొగరెక్కిందా! ఈ గంజి కుక్కలు కూడా తాగవ్! ఏమనుకొంటున్నావో! లే! లేచి వెళ్ళి అన్నం వండు ఫో!” అన్నాడు ఆమెను లేపుతూ. వెంకమ్మ లేవబోయి తూలింది. ఆమెను బలవంతంగా లేపి కూర్చో బెట్టాడు.

“అయ్యా! నిజంగా చెప్తున్నాను! లేచి నిలబడే ఓపిక కూడా లేదు! నన్ను దయచేసి ఒదిలెయ్! రేపు చేస్తానన్నాను కదా! నన్నర్థం చేసుకోవయ్యా!” అంది నీరసంగా వెంకమ్మ.

దాంతో పిచ్చి కోపంతో తాగుడు మైకంలో ఆమెను ఒక్కసారిగా లేపి గుమ్మం వైపు తోస్తూ “చెప్తుంటే నీక్కాదే! ఏం మొగుడంటే లెక్క లేకుండా పోయిందా! మర్యాదగా వెళ్తావా! లేదా లేకపోతే మెడబెట్టి రోడ్లో నెట్టాలా!” అంటూ ఆమెను గుమ్మం వైపు ఒక్క నెట్టు నెట్టాడు కోటయ్య. ఆమె ఆ విసురుకు తల గుమ్మానికి కొట్టు కొని ‘అమ్మా’ అని అరిచింది బాధగా వెంకమ్మ. ఆమెను తోసిన తోపుకు ఆమె బొడ్లో దోపిన ఐదువందల రూపాయల నోటు క్రింద పడింది. అది చూడగానే కోటయ్య కళ్ళు మెరిసాయి.

ఆనందంగా వంగి ఆ నోటు కళ్ళ కద్దుకొని “వెంకీ! పోనీలే! ఈ నోటు ఉందిగా నేనే వెళ్తాలే!” అంటూ గుమ్మం దాటబోయాడు.

వెంకమ్మ గుండెలు జారిపోయాయి.

“అయ్యా! ఆ డబ్బు తాకొద్దు. ఆ డబ్బుతో శీనుగాడికి దీపావళికి కొత్తలాగూ, చొక్కా కొనాలని పెద్దరెడ్డిని అప్పు అడిగి తెచ్చాను. నీకు పుణ్యం ఉంటుంది. ఆ డబ్బు ఇవ్వు” అంటూ అతని కాలు పట్టుకొంది.

కోటయ్య “ఎందుకిస్తానే! దీంతో ఇంకో రెండు బాటిళ్ళు హాయిగా తాగుతాను!” అంటూ వెకిలిగా నవ్వుతూ గుమ్మం దాటుతున్నాడు.

అంతే ఆమెకు ఒక్కసారిగా పిచ్చి కోపం

వచ్చింది. మూలనున్న కత్తిపీటతో అతని కాలు మీద కొట్టింది కోపంతో.

ఆ దెబ్బకు "అమ్మో! చంపేశావు కదే రాక్షసీ!" అంటూ కాలు పట్టుకొని కూలబడ్డాడు కోటయ్య. రక్తం కారిపోతూంది. వెంటనే స్పృహ తప్పాడు. తను చేసిన పని జ్ఞాపకం వచ్చి వెంకమ్మ నిలువునా వణికిపోయింది. ఇదంతా చూస్తున్న శీను "అమ్మా!" అంటూ వెంకమ్మను చుట్టుకొని ఏడుస్తున్నాడు.

వెంకమ్మ వర్తమానంలోకి వచ్చింది. ఎవరో పోలీసులకు ఫోన్ చేసారు. పోలీసులు వచ్చి కోటయ్యను హాస్పిటల్‌కు తరలించారు.

వెంకమ్మ చేతులకు బేడీలు వేసి జీపులో కూర్చోబెట్టారు. ఆమెను జనం అంతా విడ్డూరంగా నిరసనగా చూస్తున్నారు. వెంకమ్మ నిర్లిప్తంగా ఎవ్వరినీ చూడకుండా తలవంచుకొని జీపులో కూర్చుంది.

ఇంతలో "అమ్మా!" అంటూ శీను పరుగెత్తుకుంటూ జీపు దగ్గరకొచ్చాడు.

"అమ్మా! నన్నూ తీసుకెళ్ళమ్మా! నన్నెవరు చూస్తారమ్మా! బువ్వ ఎవరు పెడ్తారమ్మా!" అంటూ జీపు పట్టుకొని భోరుమని ఏడవ సాగాడు. పోలీసులు అతన్ని నెట్టారు.

అప్పుడు వెంకమ్మ కదిలి శీనును చూసి "శీనూ! బాబూ! ఏడవమాకురా! నేను తొరగా వొచ్చేత్తాను, అంతదాకా నువ్వు బుద్ధిగా రెడ్డి గారింట్లో వుండరా. నా బాబూ!" అంటూ ఏడుస్తూ చెప్పింది. జీపు వెళ్ళి పోయింది.

"అమ్మా!" అంటూ జీపు వెనకాల పరుగెడ్తూ పడిపోయాడు శీను.

అది చూసి రాములమ్మ శీనును పట్టుకొని లేపింది. "బాధపడమాకు శీనూ! నేను నిన్ను చూస్తాలే బాబూ" అంది దగ్గరకు తీసుకొని.

మర్నాడు! వెంకమ్మ బోనులో నిలబడింది.

"అయ్యా! పెద్దలూ మీకు ఒక నమస్కారాలు బాబూ!

నా మొగుడు తాగినా బాధ పడలేదు. రిక్షా తొక్కి ఆ డబ్బు పెట్టి తాగేవాడు. తాగి కొట్టే దెబ్బలు ఓర్చుకోలేక పోతున్నాను. శీనుగాడి కోసం అట్టే పెట్టిన డబ్బు తీస్కుంటే చూస్తూ ఊరుకోలేక పోయాను. ఎప్పటి నుంచో దీపావళి నాడు కొత్త బట్టలు కట్టుకోవాలని శీనుగాడు ఆశపడ్తున్నాడు. అందుకోసం నేను 3 సం॥లుగా డబ్బు దాస్తున్నాను. ఆ డబ్బు తీసుకొని తాగుడుకు తగలేస్తానంటే భరించలేక నా మొగుడు అని చూడకుండానే కొట్టాను.

## త్రాగుబోతు



నిత్య మద్య
సేవనము
నీచాతినీచము
మానవత్వమునది
మంటకలుపు
విత్త, కీర్తుల
భువిని
విదిల్చివేయు
సతి,
సుతులేకాదు
బంధుజన
సంఘములు
ఛీదరించుకొందు
రతని ఛీ, ఛీ
యటంచు
త్రాగుబోతు
బ్రతుకు కన్నవారికి చేటు
త్రాగుబోతు బ్రతుకు బండబారును జగతి
బుద్ధిమాంద్యము పెరిగి 'సుద్దు'ల
మరపించు
అనృతములాడుటకు బుద్ధిని మరల్చ
సద్గతులు, సత్తువు లాయువు తరుగు
జీవనాధారము తగ్గి జీవచ్ఛవముగా నిల్చి
బ్రతకలేక బ్రతుకు, బ్రతికియు చచ్చు
ఆల్కహాలు కోసమై అలమటించును
రమ్ము, విస్కీ బ్రాంది కోసమై భ్రాంతి
చెందు
భవిత బుగ్గికాగ, పురుషార్థమే పోగ
చివరి రోజులందు 'మలిన క్రిమి'గ మిగిలి
మనుజ జన్మ మర్మమే మరచు నరుడు

– గాయత్రి

క్షమించండయ్యా! దీనికి మీరు ఏ శిక్ష వేసినా నాకిష్టమే" అని ముగించింది వెంకమ్మ.

బోనులో తలవంచి ఏడుస్తోంది వెంకమ్మ.

ఆరునెలల తర్వాత వెంకమ్మను విడుదల చేశారు.

వెంకమ్మ నీరసంగా గుడిసెకొచ్చింది.

శీను "అమ్మా!" అంటూ ఆమె కాళ్ళను చుట్టుకొని ఏడ్చాడు.

వెంకమ్మ! వాడిని చూడగానే "శీనూ!" అంటూ వాడిని ప్రేమగా ఒళ్ళో కూర్చోబెట్టుకొంది.

**ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వరలోనే అందజేయబడుతుంది.**

**– ఎడిటర్**

"ఇన్నాళ్ళు ఎక్కడున్నావమ్మా!" అన్నాడు శీను. "ఊరికి వెళ్ళానులే బాబూ!" అంది వెంకమ్మ.

ఇంతలో కుంటుతూ, కుంటుతూ కోటయ్య వచ్చాడు.

అతన్ని అసహ్యంగా చూసింది వెంకమ్మ.

కోటయ్య ఆమె మొహం వంక చూడలేక పోయాడు.

"నన్ను ఛమించవే వెంకీ" అన్నాడు కోటయ్య.

"అయ్యో! నేను చెప్తున్నానని కోప్పడమాక! నీ తాగుడుతో ఎంత పని జరిగిందో చూశావుగా! మనం ఎంత సంతోషంగా ఉండేవోళ్ళం. నీ తాగుడు మనల్ని ఎంత కష్టపెట్టిందో చూడు. నన్ను జైలుకు పంపింది. నీ కాలు విరగ్గొట్టింది. నువ్వు సంపాదించిన డబ్బంతా తగలేసి తాగుతున్నావు. ఒళ్ళు గుల్ల చేసుకొంటున్నావు. అమ్మేవాళ్ళకేం మీలాంటి వాళ్ళ బలహీనతలతో ఆడుకొని ఆ డబ్బుతో మిద్దెలు, మేడలు కడ్తున్నారు. ప్రభుత్వం రక్షించాల్సింది పోయి మీ డబ్బు భక్షిస్తోంది.

ఆ పసివాడి మొహం చూడు. నిన్ను చూసి ఎలా భయపడుతున్నాడో. నువ్వు తాగి నన్ను కొడ్తావని భయపడి నీ దగ్గరకు కూడా రావటంలేదు. ఎందుకొచ్చిన తాగుడయ్యా! మమ్మల్ని పొట్టనబెట్టుకొంటున్నది.

నేనూ, శీనూ పెద్దిరెడ్డి గారింట్లో ఉండేందుకు వెళ్ళిపోతున్నాం. ఇంక నీ యిష్టం వచ్చినట్లు తాగి తందానాలాడు." అంటూ వెంకమ్మ పెట్టె చేత్తో పట్టుకొని శీనును లాక్కెలుతూ గడపదాటబోయింది.

కోటయ్య వెంటనే ఆమె చేతులు పట్టుకొన్నాడు. "వెంకీ! నేనూ మీతో వస్తానే! నన్ను ఛమించవే! ఇకమీదట తాగను. బుద్ధి వచ్చింది. నేను కూడా మీతోబాటే పెద్దిరెడ్డి ఇంట్లో ఏదో పని చేస్తాను. పద నన్నూ తీసుకొని పో" అంటూ బ్రతిమాలాడాడు కోటయ్య.

వెంకమ్మ మొహంలో వెలుగులు నిండాయి. శీను "అయ్యా!" అంటూ కోటయ్య దగ్గరకు వచ్చాడు సంతోషంగా.

కోటయ్య ఒక చేత్తో వెంకమ్మను, రెండో చేత్తో శీనును పట్టుకొని ఆనందంగా కుంటుతూ గడప దాటాడు.

ముగ్గురి మొహంలో ఆనందాన్ని చూసి కాబోలు తూర్పు తెల్లవారింది. ❋